నులిపురుగు నివారణ మాత్రలు వేయాలి

షాద్‌నగర్‌టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి
- వివిధ మండలాల్లో అవగాహన కల్పించిన అధికారులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 5: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా 1-19సంవత్సరాల బాలబాలికలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి అన్నారు. సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ నెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్స కార్యక్రమంపై వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షాద్‌నగర్ డివిజన్‌లో మొత్తం 1-19 సంవత్సరాల పిల్లలు 85,776మంది ఉన్నారని, 1-2సంవత్సరాల చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్ర సగం మాత్రమే వేయాలన్నారు. 3-19 పిల్లలకు ఒక మాత్ర చొప్పున వేయించాలన్నారు. ఈ మాత్రలను పిల్లలకు భోజనం చేసిన తర్వాత వేయాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్ల పాల్గొన్నారు.

ఆమనగల్లు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో మండల టాస్క్‌పోర్స్ కమిటీ సమావేశం ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ పరీక్షిత్ నరేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వాల్‌పోస్టర్లను మండల స్థాయి అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫారూఖ్ హుస్సేన్, సీడీపీవో సక్కుబాయి, మండల విద్యాధికారి సర్దార్‌నాయక్, ఎంపీహెచ్‌వో తిరుపతి రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాబాద్ : జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చందనవెల్లి, షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వరలక్ష్మి, శ్రీనివాస్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నట్టల నివారణకు జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంపై వైద్యసిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 12 నుంచి మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 1-19 సంవత్సరాల లోపు చిన్నారులకు నట్టల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 1-2 ఏండ్ల చిన్నారులకు సగం మాత్ర స్పూన్ ద్వారా పొడిచేసి నీటిలో వేయాలని, మధ్యాహ్న భోజనం తర్వాత చిన్నారులకు వేయాలన్నారు. 2-3 సంవత్సరాల వారికి ఒక పూర్తి మాత్ర పొడి చేసి వేయాలని సూచించారు. 3-19 ఏండ్ల పిల్లలు చప్పరించి, నమిలి మింగేటట్లు చూడాలన్నారు. 12వ తేదీన అన్ని గ్రామాల్లో చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు వేసేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ పరీక్షిత్ నరేందర్

షాబాద్ : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు వరలక్ష్మి, శ్రీనివాస్

ఘనంగా రథోత్సవం

చేవెళ్ల టౌన్, ఫిబ్రవరి 5: చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథోత్సవ జాతర వైభవంగా ప్రారంభమైంది. దేవాలయంలో సోమవారం ఉదయం పుణ్యావాచనమ ధ్వజారోహణ, అఖండ దీపారాధన, రాత్రి స్వామి వారు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణంతో దేవాలయం మార్మోగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, పూజారులు శ్రీకాంత్ చారి, శ్రీపాద్‌చారి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్

కొత్తూరు, ఫిబ్రవరి 6: మున్సిపాలిటీలోని మెరిడిన్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. సంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. స్పోర్ట్స్ మీట్ సందర్భంగా ఆటల పోటీలను ప్రారంభిచారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వినోద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం, ఫిబ్రవరి5: ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గున్‌గల్ గేటు సమీపంలో సోమవారం జరిగింది. సీఐ సైదయ్య వివరాల ప్రకారం..నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి మాల్ వైపు వస్తుంది. సరిగ్గా మండలంలోని గున్‌గల్ గేటు సమీపంలోకి రాగానే మాల్ నుంచి హైదరాబాద్ వైపు ఎదురుగా అతి వేగంగా వస్తున్న డీసీఎం ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కీసనపల్లికి చెందిన యేసు దానయ్య (37) తలకి బలమైన గాయాలయ్యాయి. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న మిగతా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త, అతివేగంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముస్సిపాలిటీలో ఉచిత వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 5: జన్ సాహస్ (అంకిత) స్వచ్ఛంద సంస్థ సోమాజిగూడ సీఎస్‌సీ హెల్త్ సెంటర్‌తో కలిసి మున్సిపాలిటీ 15వ వార్డు పరిధిలోని మర్రిపల్లి, ఆర్కేనగర్‌లో సోమవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. శిబిరనికి వచ్చిన వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్టులు చేశారు. కొందరికి వెంటనే ఫలితాలు తెలియజేశారు. పలు రకాల రోగాలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను బీఆర్‌ఎస్ కౌన్సిలర్ పాశం అర్చన పర్యవేక్షించారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన శ్యామ్ గైక్వాడ్(36)కౌశ బాయ్(55), నయిముద్దీన్(31), ఆర్బాజ్ (30) విశాఖపట్నం నుంచి రైలులో సోమవారం సాయంత్రం 31 కిలోల 300 గ్రాముల గంజాయిని తీసుకుని హైదారాబాద్ శివారులో అమ్మడానికి శంకర్‌పల్లికి వచ్చారు. అంతర్గత సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేయగా.. గంజాయి దొరికింది. నిందితుల వద్ద నుంచి రూ.78 లక్షల విలువగల 31 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. నయిముద్దీన్, ఆర్బాజ్‌లు ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలకవర్గానికి సన్మానం

పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న స్పెషల్ అధికారి, పంచాయతీ సిబ్బంది

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 5: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో ముఖ్యమని చేవెళ్ల స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం చేవెళ్లలోని పంచాయతీ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో బండారి శైలజ , ఉప సర్పంచ్ గంగి యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

సకాలంలో సరుకులను అందజేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 5 : రేషన్ సరకులను ప్రజలకు సకాలంలో అందించాలని తహసీల్దార్ లలిత అన్నారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గౌరారం గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ దుకాణాన్ని సోమవారం ఎంపీడీవో ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన రేషన్ దుకాణాన్ని అందుబాటులో ఉన్న వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిట్ట మంగమ్మ, రేషన్ దుకాణ నిర్వాహకురాలు శివాని, నాయకులు నిట్ట నారాయణ, శివ, తిరుపతయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకు అందజేస్తున్న తహసీల్దార్ లలిత, ఎంపీడీవో ఫారూఖ్ హుస్సేన్

పేదలను ఆదుకోవడమే ట్రస్టు లక్ష్యం

కడ్తాల్, ఫిబ్రవరి 5 : పేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని కడ్తాల్ జడ్పీటీసీ, ట్రస్టు చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని గాన్గుమార్లతండా గ్రామ పంచాయతీకి చెందిన నేనావత్ పురాన్ సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ట్రస్టు తరపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు పాండూనాయక్, భీమన్, శ్రీనునాయక్, పత్యా, రవి, సూర్య,రమేశ్, సక్రు, చందర్, రాజు, మహేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితే బంగారు భవిష్యత్

మొయినాబాద్, ఫిబ్రవరి 5 : విద్యార్థులు కష్టంతో కాకుండ ఇష్టంతో చదవాలని, పరీక్షల సమయంలో భయం వీడితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ మోటివేషన్ స్పీకర్ రంజిత్, శ్రీరాం అన్నారు. మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాస అభివృద్ధిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. మహనీయుల చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

కడ్తాల్, ఫిబ్రవరి 5ః తలకొండపల్లి మండల ఎస్‌ఐగా బాధ్యతులు చేపట్టిన శ్రీకాంత్‌ను సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా ఆయనకు పలువురు నాయకులు శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు. ప్రజలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారిస్తానని వివరించారు. అనంతరం ఎస్‌ఐ దేవుని పడకల్ గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ సీతారాంరెడ్డి, జ్యోతయ్య, మల్లేశ్, ఈశ్వర్, రవి, దశరథం, వెంకటయ్య, సజ్జుపాషా, జంగయ్య, యాదయ్య, చంద్రశేఖర్, భిక్షపతి, అర్చకుడు పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తున్నదని ఫౌండేషన్ సంస్థ సభ్యులు నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్, రాంపూర్, పడకల్, తలకొండపల్లి, చుక్కాపూర్, చంద్రధన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిరుపతిగౌడ్, మల్లయ్య, మల్లేశ్, మహేశ్, శివ, విజయ్, శివ, కల్యాణ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 5: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని భాగ్యనగర్‌కాలనీ కృష్ణవేణి పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. విద్యార్థిని, విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల రుచికరమైన వంటకాలను ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ హాజరై మాట్లాడారు. మనం తయారు చేసుకునే వంటకాలు రుచితో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రఫత్‌సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

మొయినాబాద్, ఫిబ్రవరి 5 : చెట్ల కొమ్మలను తొలగించడానికి మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ బానోత్ హమునాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి 11కేవీ ఫీడర్, తోలుకట్టా 11కేవీ ఫీడర్, కనకమామిడి 11కేవీ ఫీడర్, బ్రౌన్‌టౌన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి

షాద్‌నగర్, ఫిబ్రవరి 5: కేశంపేట మండలం కోనాయపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సుప్పరి రవీందర్ గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. బీఆర్‌ఎస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో మంచి పేరున్న నాయకుడు మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద మృతి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 : గుర్తు తెలియని మహిళా అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. మండలంలోని జనవాడ గ్రామ శివారులోగల బీరప్ప ఆలయం ముందు గల ఖాళీ స్థలంలో సుమారు 20-25 సంవత్సరాల వయస్సు గల మహిళ విగతజీవిగా పడిఉంది. స్థానిక ప్రజలు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరీశీలించగా.. మహిళ కుడి చేయి విరిగి ఉంది. మృతురాలి ఒంటిపై తెలుపురంగు ప్యాంటు, నలుపు రంగు టీ షర్టు ధరించి ఉందని తెలిపారు. ఈ మెరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైనికుల్లా పనిచేయాలి

మంచాల, ఫిబ్రవరి 5 : గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో భాషయ్య, శ్రీశైలం, గడ్డం రాజేందర్ రెడ్డి, బండి రాజు, పాండు, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, మోహన్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేసుకుందాం

- షాద్‌నగర్ మ్మెల్యే వీర్లపల్లి శంకర్
- షాద్‌నగర్ మున్సిపల్ బడ్జెట్ రూ.2637.31లక్షలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 5: షాద్‌నగర్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంతో పాటు మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. 2024-25ఆర్థిక సంవత్సరానికి అంచనా మొత్తం ఆదాయం ప్రభుత్వ గ్రాంటు కలుపుకొని రూ.2637.31 లక్షలు, అంచాన వ్యయం రూ. 2579.90 లక్షలుగా నిర్ధారించారు. సొంత రెవెన్యూకు రూ. 2020.31లక్షలు, మిగులు బడ్జెట్ రూ.57.41లక్షలు, సొంత రెవెన్యూ వ్యయంలో వేతనాలు, జీతాలు, పారిశ్యుద్ధ నిర్వహణ, కరెంట్ చార్జీలు, వార్డుల వారి ఖర్చు రూ. 1962.90 లక్షలు, అదే విధంగా గ్రాంట్స్ ఆదాయం రూ. 617 లక్షలు, గ్రాంట్స్ వ్యయం రూ. 617 లక్షలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కమిషనర్ చీమా వెంకన్నబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు లైసెన్స్‌లను జారీ చేయాలి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 5: దస్తావేజు లేఖరులకు లైసెన్స్‌లు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం షాద్‌నగర్ దస్తావేజుల సంక్షేమ సంఘం నాయకులు స్థానిక సబ్ రిజిస్ట్రర్లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దస్తావేజు లేఖర్లకు వెంటనే లైసెన్స్‌లు జారీ చేయాలని, ఎంతో మంది ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. 2001 సంవత్సరంలో తీసివేసిన లైసెన్స్‌లు ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారిన లైసెన్స్‌లు మాత్రం జారీ చేయలేదని వాపోయారు. లైసెన్స్‌లు ఇవ్వడం ద్వారా రిజిస్ట్రేషన్‌లో జరిగే తప్పిదాలను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, వాహబ్‌ఖాన్, ఒగ్గు కిశోర్, ఆదామ్, అనిల్, చిట్టిబాబు, మెడికల్ చిట్టిబాబు, రహమాన్, సంతోష్, శ్రీకాంత్‌రెడ్డి, చందర్‌రాజు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తూరు, ఫిబ్రవరి 6: మాజీ ఉప సర్పంచ్ వర్ధంతి సందర్భంగా కుమారుడు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీంరెడ్డి పెంజర్ల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య దొరుకుతుందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

శ్రీశైలం చేరిన స్వాముల పాదయాత్ర

షాబాద్, ఫిబ్రవరి 5: శివస్వాములు పాదయాత్ర ద్వారా శ్రీశైలం చేరుకున్నారు. ఈ నెల 1వ తేదీన షాబాద్ మండలంలోని చిన్నసోలిపేట్ నుండి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు సోమవారం శ్రీశైలం చేరుకున్నారు. అక్కడ మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శివస్వాములు శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

కొత్తూరు : బండ్ల శివబాబు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర బృందం శ్రీశైలం చేరుకుంది. ఈ బృందంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్‌తోపాటు, దేవేందర్‌యాదవ్, 30 మంది పాల్గొన్నారు. 8 రోజులు పాటు సాగిన పాదయాత్ర బృందం సోమవారం శ్రీశైలం చేరుకుంది.

నాలుగేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

షాద్‌నగర్, ఫిబ్రవరి 5: ఆరు బయట ఆడుకుంటున్న ఓ బాలికపై విశ్రాంత ఉద్యోగి లైంగిక దాడికి పాల్పడిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షాద్‌నగర్ మున్సిపాలిటీ అయ్యప్పకాలనీలో నాలుగేండ్ల చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా అదే కాలనీకి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి అనుపటి పెంటయ్య బాలికకు చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పెంటయ్యపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రతాపలింగం తెలిపారు.

హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ చంద్రయాదన్‌గూడ సమీపంలోకి రాగానే టైరు పేలింది. దీంతో డివైడర్‌ను ఢీ కొట్టి రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో లారీని రోడ్డు మధ్య నుంచి తొలగించారు. - నందిగామ, ఫిబ్రవరి 5

ఓవర్‌టెక్ చేయబోయి ఆటో బోల్తా : ఒకరి మృతి

మొయినాబాద్, ఫిబ్రవరి 5 : ఓవర్‌టెక్ చేస్తున్న క్రమంలో ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్యాసింజర్ ఆటో టీఎస్ 07 యూఏ 9247 నంబర్ గల ఆటో సోమవారం సాయంత్రం 10 మందితో మొయినాబాద్‌లో జరిగే సంతకు వస్తున్నారు. ఆటో డ్రైవర్ అతివేగంగా అప్పారెడ్డిగూడ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ డోజర్‌ను ఎడవ వైపు నుంచి పూర్తిగా రోడ్డు దిగి ఓవర్ టెక్ చేస్తున్నాడు. మళ్లీ రోడ్డు ఎక్కుతున్న క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అనిమోని కిష్టయ్య(70) తలకు బలమైన దెబ్బ తగలడంతో పాటు కాలు విరిగింది. అతడిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి కూతురు సతోషకు తీవ్రగాయాలయ్యాయి. కిష్టమ్మ చేతి విరగగా, హస్మ అనే మహిళ కాలు విరిగింది. మిగతా వారికి సల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అబులెన్స్ ఆలస్యంగా రావడంతో పరిస్థితి విషమించి కిష్టయ్య మృతి చెందాడని స్థానికులు ఆరోపించారు. అంబులెన్స్ సుమారుగా గంట తరువాత ఘటనా స్థలానికి చేరుకుందని పలువురు పేర్కొన్నారు.

బస్టాండ్‌ను మార్చాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంచాల, ఫిబ్రవరి 5 : మంచాల మండలం ఆరుట్ల గ్రామ పంచాయతీ వద్ద ఉన్న బస్టాండ్‌ను మార్చి వేంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేయాలని సోమవారం ఇబ్రహీంపట్నం డీఎంకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరుట్లలో ఉన్న బస్టాండ్ వల్ల ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని, అక్కడ బస్సులు మళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేశ్ పాల్గొన్నారు.